'తన కడుపూ పండి, తనకూ ఓ బిడ్డుంటే ఉంటే ఎంత ఆనందం! వెన్నెల బయళ్ళలో బువ్వ తినిపించడం యెంత అదృష్టం?'

# ఎప్పటికి ఆ భాగ్యం! ★

తీరని కోరిక

• రచన: శ్రీ నాగగోపాలరావు

అత్తలేని కాపురం. ఆడబడుచు ఒకతె. తోడి కోడళ్లు ఇద్దరు. పెద్దకోడలికి పసినిమ్మల వంటి నిసువులు ముగ్గురు. ఆమె కోమలముఖం లో కోమలహాసం, ఫాలతలంలో ప్రశాంతిరేఖ, పసిడిఒడలిలో మిసమిసలూ భాసి స్తవి. మల్లె పువ్వులాంటి తెల్లచీరెలు ధరిస్తుంది. అవే ఆమెకు అందం తెస్తవి. పెనిమిటికీ పెద్దకూ తల్లో నాలుకలా వర్తిస్తుంది. గరువం యెరుగని గరిత. తానై సంసారం చక్కదిద్దుకునే నేర్పు ఆనందానుభూతి చేకూరింది. అది ఆమె అదృష్టం!

తా నా యింటి చిన్నికోడలు. తనభర్తా మంచి వాడే. తనకూ అతనికీ అన్యోన్యానురాగం లేక పోలేదు. కాని....ఏదో లోటు మాటికీ కనిపించేది.

అతనికి సంగీతమన్నా చిత్రలేఖనమన్నా అమితప్రీతి. ఇంటివద్ద ఉన్నంతసేపూ అతగాడు బొమ్మలుగీస్తోనో, బుల్ బుల్ వాయించుకుంటానో కూచుంటాడు. తానూ ప్రక్కను చేరి ఆలోకిస్తూ ఆలకిస్తూ వుంటుంది.

అ పనిముగిసిందే అతను కసరత్తుచేసి, కాచిననీళ్లు పోసుకొని, కంకరగుట్లకు సర్కీటు పోతాడు. అదీ అతని దినచర్య: అక్కడ నుండి తనకేమీ తోచదు.

నొక్కులుదీరిన జుట్టూ, అంతకోలా, గుండ్రం కాని ముఖమూ. చక్కనికన్నులు. ముక్కున బేసరి, చెవులకు కమ్మలు, చేతులకు గాజులు, కాళ్ళకు పట్టీలు, చామనిఛాయ మేను. కొంచెం స్థూలమైనా, తగినపొడవు ఉండడం మూలాన అలా అనిపించదు. ఇదీ స్వరూపం తనది,

తలదువ్వుకొని, చేమంతిచెండు చుట్టి నీలి పూవంచు కనకాంబరంచీర కట్టుకొని నీలం అరుణం లతలద్దిన వాయిలు జాకెట్టు తొడిగి, అద్దం తిరిగినన్ని మూలలా అందాలు చూచుకొని, తిలకం దిద్దేసరికి, బారెడు ప్రొద్దెక్కుతుంది.

కాఫీత్రాగి, కాస్తచెరిగిన అందం సరిచేసి, ఉత్తరపువేపు కిటికీలోచించి తొంగిచూస్తుంది. ఉదయసాయంత్రాల్లో తోడికోడలి బిడ్డలకు క్రాపు దిద్ది, రిబ్బనుకట్టి పౌడరు అద్ది, బొట్టుబెట్టి, ఒక్కసారి నొక్కిముద్దాడి, చంకకెత్తి, వెండి గిన్నెలో బువ్వ తినిపిస్తుంది. ఏవో ఊహలతో పొంగిపోయే ఎదురొమ్ము కద్దుకుంటుంది. నవ్విస్తుంది. ఏడిపిస్తుంది. ఇంకేమేమో చేస్తుంది. ఆశాపూరితమైన ఆలోకనలతో ఆకాశాలు తిలకిస్తుంది. ఉస్సురని ఒకనిట్టూర్పు విడుస్తుంది పాపం!

ఆ యింటికి యెదురుమేడలో ఆనందరావు నివాసం. సరసుడూ, సంపన్నుడూ. సాహసం లేదు. పరకీయసాంగత్యం పాపహేతువని అతని తలపేమో! తానెంత శ్రమపడినా అతనిప్రకృతి అవగతం కాలేదు, పోనీ తన ఊహలు అతనందుకోలేకపోయాడా అంటే....అదీ నమ్మలేకపోయింది. ఇంతకూ ఎంతకూ ముడివిడిపోలేదు....ఇంగితం తెలియని భర్తతో ఎన్నాళ్ళీలాగని? నురుగులుగ్రక్కే తలపుల్లో నుంచొని మేడవేపేచూసే మెలత కలతతో సానుభూతి అతనికి ఉంది. కాని అది వెలికి రానీడు.

ఇరుగుపొరుగిళ్ళల్లో, పసిపిల్లల కిచకిచలూ కిలకిలలూ చిందులూ, చిట్టిచేష్టలూ, కిటికీలోంచి బాలక్రీడలతో పరువులెత్తే భావనాప్రవాహంలో ఆమె మునిగి మైమరుస్తుంది,

ఎదురింటిసంగతి యెందుకు తమ ఇంటిలో బుడతలనడతలు చూస్తేనే తను యేవో తం



పుల్లో, యేదో దూరపులోకంలోకి పోయిన ట్టవుతుంది!

అతగాడు గీతలుగీస్తే ఆమె కిసలయహస్తా లతో అల్లిక ల్లల్లుతుంది, "పిన్నీ!" అంటూ ఇంతలో కాముడు రాగానే కనుకొలకుల్లో కన్నీరొలుకుతుంది. ఆదిలో ఆనందం చరమా వస్థలో సంతాపం, బాష్పకణాల్లో ప్రతిఫలిస్తుంది!

చిబుకం పుణికి, శిరస్సుదువ్వి, చేతనెత్తి పువ్వులుతురిమి, నవ్వుల్లో ఓలాడి, నకనకలాడే మనస్సు కుదుటబరచ చూస్తుంది. కాని.... పాపం! ఎంత యత్నించినా కడావటికి తీరని కోరికల్లో, తీయనిబరువుతో క్రుంగిపోతుంది! ఇంతకూ పరమేశ్వరుడికి దయలేదు!

శ్రావణమాసాల్లో చక్కనిచుక్కలు, పనస తొనలువోని పసిపాపలతో వీధులవెంబడి వెళుతూ ఉంటే, చూపుమరల్చక చూస్తుంది, ఆ దృశ్యం ఒక్కనిమేషం ....ఒకే-ఒక్క-నిమేషం ........ చక్కలిగింత పెడుతుంది. ఓపికమీరి ఉప్పొంగే ఉదరవేదన్ని అదిమిపడుతుంది. కాని....కాని.... దేనికైనా పరిమితి కద్దుకా?....గిరుక్కున గది లోకి పోయి చెక్కిళ్ళపై చారలువడ శోకిస్తుంది.

తనకడుపూ పండి, తనకూ ఓ బుడుతడు వుంటే, యెంత ఆనందం! చుక్కల్లో చంద్రుణ్ణి చూపించి లాలించి, వెన్నెలబయళ్ళలో బువ్వ తినిపించడం యెంత అదృష్టం! ఈ మాత్రం యెరుగడయ్యె తనభర్త. కసరత్తుచేసిన కాయం కమ్మనినిద్రను వరిస్తుంది కాని. రమణీరమణీయ ప్రణయపరీరంభణానందాన్ని ఆశిస్తుందా? ఎల్ల కాలం ఇంతేనా? ఎవరేనా చెప్పినా బాగుణ్ణు! తరుణం దాటేక తపస్సు సిద్ధిస్తుందా?

తల్లిగర్వం ధన్యంచేసే తరుణార్భక సందర్శనం యెంత మోహనం! శిశువదనచుంబనం యెంత మధురం! మృదుపేశల తదీయశరీర స్పర్శ సుఖశీతలం! తనకు ఎప్పటికి ఆ భాగ్యం!



ఆ రో గ్య జీ వ న ము

మీ అం దు బా టు లో నే వుం ది

మనం ప్రకృతికి దూరమౌతున్నాము

అటులనే ఆరోగ్యానికినీ

కాని, గృహిణి ఆరోగ్యముగ వుండనియెడల మొత్తము గృహమే అనారోగ్యమై అనాకరవంతమై వుంటుంది. స్త్రీ ఆరోగ్యమును ఏ పరిస్థితు లందైనను కాపాడు కోవాలి. స్త్రీకి ఆరోగ్యజీవనము అందుబాటులోనే వుంది.

"లోధ్ర" స్త్రీలకు ఆరోగ్యజీవనమును ప్రసాదిస్తుంది. లోధ్ర సేవనము గర్భాశయ రోగములను నిర్మూలించి సౌందర్య సౌఖ్యజీవనమును ప్రసాదిస్తుంది.

సుదతుల సౌఖ్య సౌందర్య జీవనమునకు

లోధ్ర

కేసరి కుటీరం లిమిటెడ్., మద్రాసు.

తెలుగుజిల్లాలకు, నైజామునకు ఏజెంట్లు.

సీతారాం జనరల్ స్టోర్సు, బెజవాడ.